ఒకటి సరే.. ఇంకో రోడ్డుకు నిరాశే

- నాలుగేళ్ల క్రితం రెండు రహదారుల నిర్మాణానికి నిధులు
- పనులు జరగకపోవడంతో తర్వాత వెనక్కి..
- ఈసారి జాబితాలో ఒకే రహదారికి స్థానం



అధ్వానంగా మల్లారం రోడ్డు (ఇన్‌సెట్) నర్సింహసాగర్ రోడ్డు

పాల్వంచరూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఇప్పటికీ చాలాచోట్ల గ్రామీణ రహదారులు సక్రమంగా లేక ప్రజలు అవస్థ పడుతున్న నేపథ్యాన ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో లక్ష్యం నీరుగారిపోతుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపకపోవడం కూడా ఓ కారణంగా తెలుస్తోంది. ఇదేక్రమాన మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతాలైన లక్ష్మీదేవిపల్లి నుంచి నాలుగున్నర కి.మీ. దూరాన ఉన్న మల్లారం, లక్ష్మీదేవిపల్లి క్రాస్ నుంచి రెండు కి.మీ. దూరంలో ఉన్న నర్సింహసాగర్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు అధ్వానంగా మారడంతో కొత్త రోడ్ల నిర్మాణానికి నాలుగేళ్ల క్రితం నిధులు కేటాయించారు. అప్పట్లో కాంట్రాక్టర్లు ముందుకు రాని కారణంగా పనులు జరగక నిధులు వెనక్కి మళ్లాయి. తాజాగా ఇందులో ఒకే రోడ్డుకు నిధులు రావడంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు.

నాలుగేళ్ల క్రితం ఓసారి...

2021లో లక్ష్మీదేవిపల్లి క్రాస్ నుంచి మల్లారం గ్రామం వరకు ఎంఆర్ఆర్ స్కీమ్ కింద రూ.62లక్షలు, రెండు కి.మీ. దూరంలోని నర్సింహాసాగర్ వరకు రూ.22లక్షలు రోడ్లకు నిర్మాణానికి మంజూరయ్యాయి. అయితే, నాలుగేళ్లుగా పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఈ రెండు రోడ్ల నిర్మాణానికి పలుమార్లు టెండర్లు పిలిచిన కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో నిధులు వెనక్కి మళ్లాయి.

రాకపోకలకు ఇబ్బందులు..

మల్లారం, నర్సింహసాగర్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల మధ్య వాగులు ఉండడంతో చిన్నపాటి వర్షమొస్తే లోలెవల్ చప్టాలపైకి వరద చేరి రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వర్షకాలం వస్తే చాలు గ్రామం నుంచి మండల కేంద్రమైన పాల్వంచకు వెళ్లడం గగనమవుతోంది. ఈనేపథ్యాన మల్లారం రోడ్డుకు నిధుల మంజూరుపై హర్షం వ్యక్తమవుతుండగా.. నర్సింహసాగర్ రోడ్డు పరిస్థితి ఏమిటని ప్రజలు ప్రశిస్తున్నారు.

రోడ్డు నిర్మాణం చేయాలి



మల్లారం నుంచి లక్ష్మీదేవిపల్లి క్రాస్ వరకు రెండు కి.మీ. మేర కంకర, గుంతలు తేలి ప్రమాదకరం మారింది. గతంలో నిధులు మంజూరైనా నిర్మించలేదు. ఈసారి నిధులే మంజూరు చేయకుండా నిర్లక్ష్యం వహించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి. – పూనెం రాంబాబు, నర్సింహాసాగర్

ప్రమాదకరంగా రాకపోకలు



లక్ష్మీదేవిపల్లి క్రాస్ నుంచి నర్సింహసాగర్ వరకు రోడ్డు అధ్వానంగా మారడంతో రాకపోకలకు భయమేస్తుంది. గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. వర్షకాలంలో వాగు ప్రవహిస్తే రాకపోకలు ఆగిపోతున్నాయి. వెంటనే స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలి.– పూనెం కృష్ణ, నర్సింహాసాగర్

వరద రాకుండా చూడాలి



మల్లారం రోడ్డులో ఉన్న వాగు వర్షాకాలంలో పొంగితే వరద చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. రోడ్డు నిర్మాణం చేయకపోయినా పర్వాలేదు. కనీసం లోలెవల్ చప్టాపైకి వరద చేరకుండా అధికారులు వెంటనే చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

– ఈసం శ్రీనివాస్, మల్లారం

మల్లారం రోడ్డుకు రూ.90లక్షలు

రెండు రోడ్లకు గతంలో ఎంఆర్ఆర్ స్కీం కింద రూ.84లక్షలు మంజూరవడంతో నాలుగు సార్లు టెండర్లు పిలిస్తే ఎవరూ రాక రద్దయ్యాయి. ఇప్పుడు మల్లారం రోడ్డుకు రూ.90లక్షలు కేటాయించారు. నర్సింహాసాగర్ రోడ్డుకు ప్రతిపాదనలు పంపినా నిధులు రాలేదు.

– శివలాల్, పంచాయతీరాజ్ శాఖ ఏఈ

సింగరేణికి బకాయిలు చెల్లించండి..



మాట్లాడుతున్న మాధవ నాయక్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థకు రావాలిన్సన రూ.3,645 కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏబీకేఎంఎస్ నాయకుడు పి.మాధవనాయక్ డిమాండ్ చేశారు. ఈ విషయంలో గుర్తింపు సంఘాలు విఫలవుతున్నాయని ఆరోపించారు. కొత్తగూడెంలోని సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ట్రాన్స్‌కో, జెన్‌కో నుంచి డిసెంబర్ 2024 నాటికి సింగరేణికి రూ.35,645 కోట్ల బకాయి ఉండడంతో సంస్థ మనుగడకే ముప్పు వాటిల్లనుందని ఆందోళన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడి బకాయిలు చెల్లించేలా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కృషి చేయాలన్నారు. కాగా, రెండోసారి ఏబీకేఎంఎస్ జాతీయ కార్యదర్శిగా ఎన్నికైన మాధవ నాయక్‌ను సన్మానించగా నాయకులు కృష్ణారెడ్డి, టీఎస్.పవన్‌కుమార్, రాంసింగ్, మొగిలిపాక రవికుమార్, ఊట్ల గణేష్, నాగప్రసాద్, సంగం చందర్, వి.వెంకటేశ్వరరావు, ఐ.నాగేశ్వరరావు, లట్టి జగన్మోహన్‌రావు, టీవీ.సూరి, వెంకటరెడ్డి, ఎం.శ్రీనివాస్ ఉప్పు శ్యాం పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికతో చదువుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ స్వాతి బిందు



హాజరైన విద్యార్థినులు

జూలూరుపాడు: విద్యార్థులు క్రమశిక్షణతో ప్రణాళికా బద్ధంగా చదివితే లక్ష్యాలను చేరుకోవచ్చని తహసీల్దార్ కె.స్వాతిబిందు, ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డి, ఐటీడీఏ పీహెచ్‌ఓ, కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం స్పెషల్ ఆఫీసర్ ఉదయ్‌కుమార్ అన్నారు. మంగళవారం పడమటనర్సాపురం గిరిజన బాలికల ఉన్నత పాఠశాలలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావంతో విద్యను అభ్యసిస్తే తమ లక్ష్యాలను నెరవేర్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏసీఎంఓ రమణయ్య, జూలూరుపాడు పీహెచ్‌సీ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, సీహెచ్‌ఓ రామకృష్ణ, ఏఎస్‌ఓ నరసింహారావు, ఏజీహెచ్ఎస్ హెచ్ఎం సుభద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి..

విద్యార్థులకు నాణ్యత, పరిశుభ్రమైన భోజనం అందించాలని జూలూరుపాడు తహసీల్దార్ కె.స్వాతిబిందు అన్నారు. మంగళవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె కేజీబీవీలోని వంట గది, నిత్యావసరాల స్టాక్ రూమ్, తరగతి గదులు, టాయిలెట్స్‌ను పరిశీలించారు. బియ్యం, సరుకులు, కూరగాయలతోపాటు, విద్యార్థులకు తయారు చేసిన వంటల రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినులతో మాట్లాడారు. మెనూ పాటిస్తున్నారా? ఏమైనా అనారోగ్య, ఇతర సమస్యలు ఉన్నాయా? విద్యాబోధన ఎలా కొనసాగుతోందని అడిగి తెలుసుకున్నారు.

వీధిలైట్లు లేక ఇబ్బంది పడుతున్నామని, రాత్రి సమయాల్లో అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వెళ్లాలంటే భయంగా ఉందని, పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఎస్‌ఓ, టీచర్లు చెప్పడంతో.. స్పందించిన తహసీల్దార్ విద్యుత్‌శాఖ ఏఈ సతీష్‌కు ఫోన్ చేసి సమస్యను వివరించారు.

ఓసీ ప్రైవేటీకరణను అడ్డుకుంటాం..



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని వీకే–7ఓసీ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని గుర్తింపు కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఏరియాలోని ఏరియా వర్క్‌షాపులో జరిగిన పిట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాల వల్ల సింగరేణికి నూతన బొగ్గుబావులు రావడం లేదని ఈ పరిస్థితుల్లో చేతికి వచ్చిన గనులను సంస్థే బొగ్గు తవ్వకాలు చేపట్టాల్సింది పోయి, ప్రైవేట్‌కు అప్పగించే ప్రయత్నాలు చేస్తున్నారని దీనిని ఏఐటీయూసీ సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆందోళనలకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. వీకే ఓసీ ప్రైవేటీకరణ ప్రయత్నాలు విరమించుకోవాలని లేదంటే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సింగరేణికి రూ.30 వేల కోట్లకుపైగా బకాయిలు రావాల్సి ఉన్నా.. రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. సింగరేణి ఆస్పత్రులలో సరైన చికిత్స అందటం లేదని, రిఫరల్ మీద ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తే సరైన చికిత్స అందటం లేదని, నిమ్స్ టారిఫ్ పేరిట కార్మికుల డబ్బును దోచుకుంటున్నారని ఆరోపించారు. కార్మికుల సొంతింటి పథకం త్వరగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీకే–7 ఓసీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 10న ఏరియా జీఎం కార్యాలయం ఎదుట చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వట్టికొండ మల్లికార్జున్, గట్టయ్య, కత్తెర్ల రాములు, మధు కృష్ణ, సాంబమూర్తి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం

ఇల్లెందు: ఇల్లెందు – కొత్తగూడెం రోడ్డులోని జగదాంబా గుంపు ఏరియాకు చెందిన రాపాక జయసింహా (మాజీ వర్క్ ఇన్‌స్పెక్టర్) రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. సోమవారం రాత్రి కరెంటాఫీస్ నుంచి తన ఇంటికి బైక్‌పై వెళ్తుండగా ఓ కారు వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో జయసింహాకు గాయాలయ్యాయి. బైక్ కూడా దెబ్బతిన్నది. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ బత్తుల సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డప్పు ర్యాలీని జయప్రదం చేయండి

టేకులపల్లి: ఎస్సీ వర్గీకరణలో అన్నివర్గాలకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీల ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపులో భాగంగా బుధవారం జిల్లా కేంద్రం కొత్తగూడెంలోని పోస్టాఫీసు సెంటర్ నిర్వహించే డప్పుల ర్యాలీని జయప్రదం చేయాలని ఆ సంఘాల జిల్లా కన్వీనర్ నల్లగట్ల వెంకన్న పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ డాక్టర్ షమీర్ అక్బర్ ఇచ్చిన నివేదికలో లోపాలు ఉన్నాయని మందకృష్ణ మాదిగ ప్రభుత్వానికి, సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ కుమార్‌రెడ్డికి విన్నవించడం జరిగిందన్నారు. మాదిగ కోటాలో మంత్రిగా చలామణి అవుతున్న దామోదర్ రాజనర్సింహాను తొలగించాలని తన కులమేదో ఆయనే చెప్పాలన్నారు. త్వరలో జరుగుతున్న మంత్రివర్గ విస్తరణలో 10 మంది మాదిగ ఎమ్మెల్యేలలో ఇద్దరికి మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కాంట్రాక్ట్ కార్మికులను కొనసాగించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందు: ఇల్లెందు సీహెచ్‌పీలో పని చేస్తున్న సైడింగ్ కాంట్రాక్ట్ కార్మికులు 30 ఏళ్లుగా పని చేస్తున్నారని వారిని కొనసాగించాలని ఇఫ్టూ – టీయూసీఐ నేతలు కోరారు. మంగళవారం హెడ్డాఫీస్‌లో జీఎం పర్సనల్ కవితా నాయుడుకు, జీఎం సివిల్ సతీష్‌కు వినతిపత్రాలు అందజేశారు. కె.సారంగపాణి, ఎండీ రాసుద్దీన్, సంజీవ్, అంజయ్య, రఘు పాల్గొన్నారు.

కార్మికుల వేతన సవరణ చేయండి..



మాట్లాడుతున్న నబీ

ఇల్లెందురూరల్: 73 రకాల కార్మికులకు కనీస వేతన డ్రాఫ్ట్‌ను రాష్ట్ర ప్రభుత్వం సవరణ చేసి రూ.26వేలు అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక శాఖ సహాయ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నబీ మాట్లాడుతూ.. 1957లో 15వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ డాక్టర్ అక్రాయిడ్ ఫార్ములా ప్రకారం కనీస వేతనాల నిర్ణయానికి ప్రాతిపదికగా ఉండాలని నిర్దేశిస్తూ పరిశ్రమల యాజమాన్యాలు, కార్మిక సంఘాలు ఆమోదించాయని గుర్తుచేశారు. ప్రజాపాలన అందిస్తామని కార్మికులకు మెరుగైన వేతనాలు ఇస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా వేతన సవరణ చేసి జీఓ విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, నాగరాజు, మహమూద్, కటకం రాజయ్య, భద్రు, వెంకన్న, లక్ష్మణ్, పాసి, రాము, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేతన ఒప్పందం అమలు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులు

ఇల్లెందు: ఇల్లెందు మండలంలో పెంకు పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులకు వేతన ఒప్పందం చేయాలని, అందుకు యాజమాన్యం ముందుకు రావాలని, యజమానులు మొండి వైఖరి వీడాలని ఇఫ్టూ జాతీయ అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ అన్నారు. మంగళవారం ఇల్లెందు పట్టణంలో ఖమ్మం – వరంగల్ జిల్లాల పెంకు కార్మికులు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు వేతన ఒప్పందం అమలులో ఉంటుందన్నారు. అయితే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నా యాజమానులు ముందుకు రావడం లేదన్నారు. మార్చి వచ్చినా వేతన ఒప్పందం అమలు చేయకపోవటం గర్హనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బి.రాంసింగ్, ఎస్కే మదార్, బీఎస్ కాంతారావు, ఎల్ రవి, దుర్గాప్రసాద్, సనప రాంబాబు, మూతి రాంబాబు, శ్రీరాములు, ఆదినారాయణ, స్వరూప, లక్ష్మీనారాయణ, లింగయ్య, రాజమ్మ, రవి, పద్మ, ఏకాంబరం, శివ, బజారీ, వెంకట్రామ్, రంగబాబు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల పనివేళలు మార్చండి..



మాట్లాడుతున్న సారంగపాణి

ఇల్లెందురూరల్: వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని గ్రామపంచాయతీ కార్మికుల పనివేళల్లో మార్పు చేయాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు సారంగపాణి, రాష్ట్ర నాయకుడు రాసుద్దీన్ డిమాండ్ చేశారు. మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎండ వేడిమి తీవ్రంగా ఉన్నందున కార్మికులు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పనివేళలను పరిమితం చేయాలని కోరారు. కార్మికులకు నెలకు రూ.26వేలు వేతనంగా ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, కార్మికుల విధులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రావూరి ఉపేందర్, రామిశెట్టి నర్సింహారావు, కిరణ్, వీరబాబు, రమేష్, చిట్టిబాబు, వీరస్వామి, నాగరాజు, బాబూరావు, వెంకన్న, ప్రేంకుమార్, శ్రీదేవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇది ఉపాధ్యాయుల విజయం..



కొత్తగూడెంఅర్బన్: మాట్లాడుతున్న నాయకులు



జూలూరుపాడు: మాట్లాడుతున్న ప్రభాకర్

కొత్తగూడెంఅర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పింగిలి శ్రీపాల్‌రెడ్డి విజయం, ఉపాధ్యాయులందరి విజయమని జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవి అన్నారు. శ్రీపాల్‌రెడ్డి విజయం సందర్భంగా మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎన్నికల సందర్భంగా ఉపాధ్యాయులకు ఇచ్చిన ఆరు హామీలను నెరవేర్చడానికి శ్రీపాల్‌రెడ్డి నాయకత్వంలో కృషి చేస్తామన్నారు.

జూలూరుపాడు: నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించడం పట్ల పీఆర్‌టీయూ మండల కమిటీ మంగళవారం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా మండల కేంద్రం జూలూరుపాడులో పీఆర్‌టీయూ నాయకులు కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు చింతపల్లి ప్రభాకర్, దేవేందర్, కృష్ణ, పుల్లారావు, వెంకటరమణ, సాగర్, ప్రసాద్, వెంకటేశ్వర్లు, హైస్కూల్ హెచ్ఎం లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే 'సంక్షేమం' అందించాలి



ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించవద్దని, ప్రభుత్వమే నేరుగా సంక్షేమ పథకాలను కార్మికులకు అందించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొక్కు సారంగపాణి, జె.సీతారామయ్య డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇఫ్టూ జాతీయ కమిటీ పిలుపు మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని కార్మిక సంఘాల ప్రతినిధులతో ఏర్పాటు చేయాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ప్రమాదబీమా రూ.10 లక్షలు, 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు నెలకు రూ.10వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల అడ్డాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని, మ్యారేజీ, మెటర్నిటీ గిఫ్ట్‌లను రూ.లక్షకు పెంచాలని కోరారు. ఆస్పత్రిలో చేరితే రోజుకు రూ.వెయ్యి చొప్పున చెల్లించాలని, సాధారణ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాద మరణాలకు రూ.10 లక్షలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేబర్ కార్డు ఉండి రెన్యువల్ చేయించుకోకున్నా ప్రమాదం జరిగితే క్లెయిములు చెల్లించాలని కోరారు. కార్మికులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని విన్నవించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏసీఎల్ ఫక్రుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. భవన నిర్మాణ సంఘం రాష్ట్ర నాయకులు రావూరి ఉపేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎండీ రాసుద్దీన్, గౌని నాగేశ్వరరావు, ఎస్.సంజీవ్, మోత్కూరి మల్లికార్జునరావు, బి.వెంకటమ్మ, మంకెన వెంకటేశ్వర్లు, ఎల్.మారుతీరావు, ఎర్నం శ్రీనివాస్, రాజేష్, వెంకన్న, కొమరం మల్లేష్, నీలమ్మ, భద్రమ్మ, లలిత, పద్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



పాల్వంచరూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హాల్ టికెట్ల నంబర్లు వేస్తున్న అధ్యాపకులు

ఇల్లెందు: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇల్లెందులో ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాహితీ జూనియర్ కళాశాల, శ్రీ చైతన్య జూనియర్ కళాశాలతో పాటు సుదిమళ్ల గురుకులంలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 599 మంది, సాహితీ జూనియర్ కళాశాలలోని సెంటర్‌లో 385 మంది, శ్రీ చైతన్య కళాశాలలో 262 మంది, సుదిమళ్ల గురుకులంలో 303 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

టేకులపల్లి: నేటి నుంచి జరగనున్న ఇంటర్ వార్షిక పరీక్షలకు టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సీఎస్ కె.బసవమ్మ, డీఓ కె.ప్రసాద్‌బాబుల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రథమ 110, ద్వితీయ 118 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఈ మేరకు బుధవారం సీఎస్, డీఓల ఆధ్వర్యంలో ఇన్విజిలేటర్లకు సమావేశం నిర్వహించి నిబంధనలు వివరించారు. అనంతరం పరీక్ష హాల్‌లో విద్యార్థుల హాల్ టికెట్ నంబర్లు వేశారు.

పాల్వంచరూరల్: ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ కోసం పాల్వంచ మండలంలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేయగా మంగళవారం ఆయా కేంద్రాల్లో విద్యార్థుల హాల్ టికెట్ల నంబర్లు వేశారు. మొత్తం 1,135 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు డీఐఈఓ వెంకటేశ్వరరావు తెలిపారు. ఐదు నిమిషాల నిబంధన ఉంటుందన్నారు.

క్లుప్తంగా

కోలిండియా అథ్లెటిక్ మీట్‌లో సుష్మ ప్రతిభ



సుష్మను అభినందిస్తున్న జీఎం శాలేంరాజు

సింగరేణి(కొత్తగూడెం): ఇటీవల కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో జరిగిన కోలిండియా లిమిటెడ్ ఇంటర్ కంపెనీ అథ్లెటిక్ టోర్నమెంట్‌లో సుష్మారాణి కొత్తగూడెం ఏరియా నుంచి పాల్గొని లాంగ్ జంప్, ట్రిబుల్ జంప్, పరుగు పందెంలో మూడు సిల్వర్, ఒక కాంస్య పతకం సాధించారు. ఈ మేరకు మంగళవారం ఏరియా జీఎం శాలేంరాజు తన చాంబర్‌లో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి, డీజీఎం బి.శివకేశవరావు, బి.తావుర్యా, ఎం.శ్రీనివాస్, సీహెచ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఓపై ఉపాధి సిబ్బంది ఫిర్యాదు



ఎమ్మెల్యే కోరం కనకయ్యకు ఫిర్యాదు అందజేస్తున్న ఈజీఎస్ సిబ్బంది

టేకులపల్లి: టేకులపల్లి మండల ఉపాధి హామీ పథకం అదనపు ప్రోగ్రాం అధికారి (ఏపీఓ) కాళంగి శ్రీనివాస్‌రావు ప్రవర్తన సరిగా లేదని, కింది స్థాయి సిబ్బందిని వేధిస్తున్నారని, ఆయన ఇల్లెందు నియోజకవర్గంలో పని చేయడానికి అనర్హుడని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ పథకం సిబ్బంది ఎమ్మెల్యేను కోరారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లి ఈజీఎస్ సిబ్బంది ఈసీ, టీఏ, ఎఫ్ఏ, కంప్యూటర్ ఆపరేటర్లు ఈసీ తిరుపతయ్య, ఎఫ్ఏ తులసీరామ్‌ల ఆధ్వర్యంలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను కలిసి ఏపీఓపై ఫిర్యాదు అందజేశారు. సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా లైన్‌మెన్ దినోత్సవ వేడుకలు



బొమ్మనపల్లి సబ్‌స్టేషన్‌లో లైన్‌మెన్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

టేకులపల్లి: టేకులపల్లి మండలం బొమ్మనపల్లి సబ్‌స్టేషన్‌లో ఏఈ బుజ్జి కన్నయ్య ఆధ్వర్యంలో బుధవారం జాతీయ లైన్‌మెన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యుత్ శాఖ సీఎండీ కర్నాటి వరుణ్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాపిత కార్యక్రమంలో భాగంగా బొమ్మనపల్లిలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. లైన్‌మెన్ భూక్యా దేవ్‌సింగ్‌ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖలో పని సమయంలో తీసుకోవాల్సిన సేఫ్టీ, రక్షణ తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది వసీమ్ పాషా, యాకూబ్‌పాషా, చరణ్, లచ్చు, ప్రవర్థన్ కుమార్, శ్రీనివాసాచారి, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న ప్రకాష్

పాల్వంచ: కొత్తగూడెం రామవరానికి చెందిన ఎండీ.నబీయానవాజ్, కల్యాణ్ దంపతుల నాలుగు సంవత్సరాల కుమార్తె ఇటీవల వేడినీళ్లు పడి 60 శాతం శరీరం కాలింది. విషయం తెలుసుకున్న పాల్వంచలోని జీఎస్ కన్వెన్షన్ హాల్, చలవాది ట్రస్ట్ అధినేత చలవాది ప్రకాష్, మిత్రబృందం ఆధ్వర్యంలో రూ.50 వేల నగదును బాధిత కుటుంబానికి మంగళవారం అందించారు. చలవాది మాట్లాడుతూ... ఎవరికైనా ఆపద వస్తే, ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోతే ట్రస్ట్ ద్వారా ఆదుకుమంటామన్నారు. ఐదు సంవత్సరాల చక్రి అనే బాలుడు తన కిట్టి బ్యాంక్‌లో దాచుకున్న రూ.2,556 నగదును బాలిక వైద్యానికి అందించాడు. కార్యక్రమంలో దారం శ్రీనివాసరావు, బచ్చు మూర్తి, కొండ్లె శ్రీనివాస్, కొత్తగుండ్ల కుటుంబరావు, పసుమర్తి రాము, వసుంధర రాము, నరిగే రవీందర్, ఇందు, సుమ, పద్మ తదితరులు పాల్గొన్నారు.